సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం : 23 : జూన్ : 2024



ఆలయాలను తీర్చిదిద్దుతాం

అలంపూర్ క్షేత్రాన్ని తీర్చిదిద్దుతామని ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



బాధితురాలికి పరామర్శ

చెంచు మహిళ ఈశ్వరమ్మను పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /24.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు అవకాశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా ప్రజాపాలన దరఖాస్తుల సవరణ చేయనున్నట్లు కలెక్టర్ విజయేందిర శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తులలో సవరణలు చేయాలనుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీ కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, గ్యాస్ సిలిండర్ వివరాలు, విద్యుత్ బిల్లు సమర్పించాలని పేర్కొన్నారు.

ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జడ్చర్లలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కలెక్టర్ విజయేందిర శనివారం ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (ఎస్ఏ) పోస్టు ఓసీకి, జీవ శాస్త్రం బీసీ–ఏ మహిళకు ఒక్క పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. టెట్ అర్హత ఉండి జడ్చర్ల మండలానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీంతో పాటు మహమ్మదాబాద్‌లోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల్లో ఎస్‌జీటీ టీచర్ కోసం ఎస్సీ కేటగిరి చెందిన పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు టెట్ అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించిన కాపీలతో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో జులై 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు ఈ కార్యాలయంలోనే లభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: సుశ్రుత ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సుశ్రుత ఆస్పత్రిలో పిల్లలు పుట్టాలని కోరుకునే వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సెమెన్ ఎనాలసిస్, అల్ట్రాసౌండ్, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పిల్లలు కావాలనుకునే దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానం కోసం అన్ని రకాల వైద్యసేవలు సుశ్రుతలో అందుబాటులో ఉన్నాయని, అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 88852 21877, 9866 457501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నైపుణ్యాల సాధనతోనే భవిష్యత్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నైపుణ్యాల సాధనతోనే యువత భవిష్యత్ ఆధారపడి ఉంటుందని పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.కృష్ణయ్య అన్నారు. మహబూబ్‌నగర్ ఐటీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పీయూలోని అకాడమిక్ బ్లాక్‌లో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీలో ప్రావీణ్యం పొందిన వారికి ఎంతో గుర్తింపు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్, ఆచార్యులు, అధ్యాపకులు డా.కె.నాగసుధ, ఎస్.ఎన్.అర్జున్‌కుమార్, జావెద్ మహమ్మద్ ఖాన్, డా.ఎం.అరుంధతిరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ పీజీ పరీక్ష ఫీజులు చెల్లించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు వచ్చే నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కో–ఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షల ఫీజులను వచ్చే నెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 7382929609 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.



పాస్.. అయినా ఫెయిల్!



ఈ ఫొటోలోని రైతు పేరు బూదెప్ప. మల్దకల్ మండలం అడవిరావుల చెరువు గ్రామానికి చెందిన ఆయన గతేడాది ఖరీఫ్‌లో తనకున్న ఎకరా వ్యవసాయ భూమిలో ఓ కంపెనీకి చెందిన విత్తన పత్తి సాగు చేశాడు. పంట చేతికొచ్చిన తర్వాత తనకు సీడ్ ఇచ్చిన ఆర్గనైజర్‌కు చెప్పి.. ఆయన సూచన మేరకు జిన్నింగ్ మిల్లుకు తరలించాడు. జిన్నింగ్ అయిన తర్వాత వచ్చిన విత్తనాలను సదరు కంపెనీకి అందజేశాడు. అనంతరం సీడ్ ఆర్గనైజర్.. సదరు రైతు వద్దకు వచ్చి సీడ్ సక్రమంగా లేదని, ఫెయిల్ అయినట్లు చెప్పాడు. దీంతో బూదెప్ప అయ్యో అని తలపట్టుకున్నాడు. అనుమానంతో మూడు నెలల తర్వాత కంపెనీకి వెళ్లి ఫెయిల్ అయిన లాట్ నంబర్‌పై ఆరా తీశాడు. తాను సాగు చేసిన సీడ్ విత్తనాలు పాస్ అయ్యాయని తెలుసుకున్నాడు. ఆ వెంటనే ఆయన సీడ్ ఆర్గనైజర్ వద్దకు వెళ్లి నిలదీశాడు. ఆధారాలతో సహా ముందు పెట్టడంతో సదరు ఆర్గనైజర్ రూ.3 లక్షలు చెల్లించాడు. ఈ విషయం ఎవరితో చెప్పొద్దని ఆర్గనైజర్ బతిమాలడంతో శాంతించిన బూదెప్ప ఇంటి ముఖం పట్టాడు.

...ఇది ఒక్క ఆ రైతుకు సంబంధించి మాత్రమే కాదు. ఇలా ఏటేటా వేలాది మంది విత్తన పత్తి సాగుదారులు సీడ్ ఆర్గనైజర్ల చేతిలో నిలువునా మోసపోతూనే ఉన్నారు. అడ్డుకునే వారే లేకపోవడంతో ధనదాహంతో పలువురు సీడ్ ఆర్గనైజర్లు మాఫియాగా ఏర్పడి బరితెగించి.. రైతులకు కుచ్చుటోపీ పెడుతూనే ఉన్నారు. ఇది చాలదంటూ సాగు కోసం తమ వద్ద తీసుకున్న అప్పు రాబట్టుకునేందుకు పేద రైతుల వద్ద జులుం ప్రదర్శిస్తున్నారు. పలువురు రాజకీయ నేతల అండదండలు, అధికారుల మద్దతుతో పేట్రేగిపోతున్నట్లు గద్వాల జిల్లాలో చోటుచేసుకున్న పలు ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: విత్తన చట్టంలో లోపాలు.. అధికార యంత్రాంగంలో కొరవడిన సామాజిక స్పృహ, పర్యవేక్షణ.. పలువురు రాజకీయ నేతల ధనదాహం వెరసి సీడ్ ఆర్గనైజర్ల దందా ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు పువ్వులు ఆరు కాయలన్నట్లు కొనసాగుతోంది. ప్రధానంగా నడిగడ్డగా పేరొందిన జోగుళాంబ గద్వాల జిల్లాలో మాఫియాగా ఏర్పడిన సీడ్ ఆర్గనైజర్లు ఓ వైపు ఫెయిల్యూర్ విత్తనాలే కీలకంగా రాష్ట్ర నలుమూలలా యథేచ్ఛగా విక్రయిస్తూ రైతుల జీవితాలతో చెలగాటమాడుతోంది. మరోవైపు సాగు చేసిన సీడ్ పాస్ అయినా..ఫెయిల్ అయినట్లు బురిడీ కొట్టించి మోసాలకు పాల్పడుతూ రైతులను అధఃపాతాళంలోకి నెడుతోంది.

సీడ్ ఆర్గనైజర్ల బరితెగింపు.. రైతులకు కుచ్చుటోపీ

- విత్తనాలు సరిగ్గా ఉన్నా.. విఫలమయ్యాయంటూ బురిడీ
- ఏటా మోసపోతున్న విత్తన పత్తి సాగుదారులు
- మరోవైపు నకిలీ విత్తులతో రైతుల జీవితాలతో చెలగాటం
- ఇది చాలదంటూ పలు చోట్ల సీడ్ మాఫియా జులుం
- ముక్కుపిండి బకాయిల వసూలు.. రైతుల గగ్గోలు

ఆర్గనైజర్లే సూత్రధారులు

కంపెనీలు, రైతులకు మధ్య సీడ్ ఆర్గనైజర్ వ్యవస్థ కొనసాగుతోంది. రైతులకు ఆర్గనైజర్లు సీడ్ విత్తనాలతో పాటు అప్పులు ఇస్తారు. జర్మినేషన్ తర్వాత రైతులు విత్తనాలను ఆయా ఆర్గనైజర్లకు ఇస్తారు. ఆర్గనైజర్లు కంపెనీలకు విత్తనాలు పంపిస్తారు. ల్యాబ్‌లో పరీక్షల అనంతరం ఆర్గనైజర్ల వారీగా పాస్, ఫెయిల్ అయిన విత్తనాల వివరాలను కంపెనీలు అందజేస్తాయి. విత్తనాలు నాణ్యమైనవని తేలితే ఆర్గనైజర్లు అప్పు పట్టుకుని మిగిలిన డబ్బులను రైతులకు చెల్లిస్తారు. ఫెయిల్ అయితే రైతులు తిరిగి వారికే అప్పు చెల్లించాలి. ఈ వ్యవస్థ జిల్లాలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. సీడ్ పత్తి విత్తన చట్టం ప్రకారం ఫెయిల్ అయిన విత్తనాలను కంపెనీలు, ఆర్గనైజర్లు ఆయా రైతులకు ఇవ్వాలి. వ్యవసాయ అధికారుల సమక్షంలో బ్రోకెన్ (పగలగొట్టి) చేసి అందజేయాలి. ఇలా ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. ఫెయిల్ అయిన విత్తనాలను ఆర్గనైజర్లే తమ వద్ద నిల్వ చేసుకుంటున్నారు. ఎవరైనా రైతులు కావాలని పట్టుబడితే నామమాత్రంగా కిలోకు రూ.200 మించకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఫెయిల్ అయిన విత్తనాలను ఆర్గనైజర్లు 20 శాతం మంది రైతులకు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ఇటు మోసం.. అటు వ్యాపారం

సాగు చేసిన పత్తి సీడ్ పాస్ అయినా.. ఫెయిలయ్యాయంటూ రైతులకు చెల్లించాల్సిన లక్షలాది రూపాయలను సీడ్ ఆర్గనైజర్లు వెనకేసుకుంటున్నారు. అమాయక రైతులే టార్గెట్‌గా మోసాలకు పాల్పడుతున్నారు. మరోవైపు ఇదే క్రమంలో ఫెయిల్ అయిన విత్తనాలను ఆర్గనైజర్లు రంగులద్ది లూజ్‌గా కిలోకు రూ.750కి అటు ఇటుగా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. నడిగడ్డలో సీడ్ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు 400 మంది వరకు ఉండగా.. సీడ్ పత్తి విత్తన సాగు సుమారు 40 వేల ఎకరాల్లో కొనసాగుతోంది. ప్రతి ఏటా జిల్లాలో సగటున రూ.2 వేల కోట్ల సీడ్ పత్తి విత్తన వ్యాపారం జరుగుతోంది. ఇందులో 20 నుంచి 30 శాతం నకిలీ విత్తన దందా చోటుచేసుకుంటున్నట్లు రైతు సంఘాల అంచనా.

కలెక్టర్ చొరవ చూపాలి..



సీడ్ పత్తి సాగు చేసే రైతులకు అందరూ అండగా ఉండాలి. సీడ్ ఆర్గనైజర్లు చేస్తున్న మోసాలను అరికట్టాలి. మోసాలకు పాల్పడే ఆర్గనైజర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంలో కలెక్టర్ చొరవ చూపి రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలి.

– రంజిత్ కుమార్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్, గద్వాల

రైతులపై జులుం..

- గద్వాల జిల్లా మల్దకల్ మండలానికి చెందిన ఓ సీడ్ ఆర్గనైజర్ వద్ద గట్టు మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన ఓ రైతు గత ఖరీఫ్‌లో సీడ్ పత్తి సాగు కోసం రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. విత్తనాలు ఫెయిల్ కావడం.. ఇతరత్రా కారణాలతో అప్పు సకాలంలో చెల్లించకపోవడంతో సదరు ఆర్గనైజర్ దాష్టీకానికి పాల్పడ్డాడు. తన వద్ద పనిచేసే గుమస్తాలను పంపించి వ్యవసాయ పొలంలో రైతుపై దాడి చేయించారు. కుటుంబసభ్యులు తిరగబడడంతో గుమస్తాలు వెనక్కి రాగా.. అప్పట్లో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి ఘటనలే ధరూరు, కేటీదొడ్డి, గట్టు మండల పరిధిలో సైతం చోటుచేసుకున్నాయి.
- గద్వాల జిల్లా అయిజ మండలంలోని బింగుదొడ్డికి చెందిన ఓ రైతు విత్తన పత్తి సాగు కోసం మల్దకల్ మండలంలోని ఓ సీడ్ ఆర్గనైజర్ వద్ద సుమారు రూ.4 లక్షలు అప్పు తీసుకున్నాడు. సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో సదరు ఆర్గనైజర్ ఏకంగా ఆ రైతు వ్యవసాయ పొలాన్ని రిజిస్టర్ చేయించుకున్నాడు. రైతులు తిరగబడడం, ఎస్పీ, కలెక్టర్ వద్దకు సమస్య వెళ్లడంతో ఆర్గనైజర్ దిగి వచ్చి ఆ భూమిని మళ్లీ రైతు పేరిట రిజిస్టర్ చేయించాడు. అప్పట్లో ఈ ఘటన దుమారం రేపింది.

‘నీట్’ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి





మహబూబ్‌నగర్ న్యూటౌన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు విద్యార్థి సంఘాల ర్యాలీ

- జిల్లాకేంద్రంలో కదంతొక్కిన విద్యార్థి సంఘాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్టీఏ నిర్వహించిన ‘నీట్’ పరీక్ష పేపర్ లీకేజీపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని న్యూటౌన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ప్రశాంత్, అవేస్, రమేష్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం నీట్ పరీక్షలో లీకేజీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం దీనిపై స్పందించకుండా గ్రేస్ మార్కులు తగ్గించి సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. దీని వల్ల నీట్ ర్యాంకులు తారుమారు అవుతాయని, గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయన్నారు. పరీక్ష కంటే ముందు బిహార్‌లో 13 మందిని అరెస్టు చేశారని, హరియాణాలో ఒకే సీరియల్ నంబర్ కలిగిన వారికి టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్తాన్, గుజరాత్‌లలో కూడా ఇలాంటి లీకేజీ వ్యవహారాలు ఉన్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ ర్యాంకులు, పేపర్ లీక్ వ్యవహారాలు ఉన్నాయని తక్షణమే సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, నందు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కోస్గి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్యావిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను, వైద్యులు, సిబ్బంది పనితీరును, కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మౌళిక వసతులపై ఆరా తీయగా పోస్టుమార్టం గది, జనరేటర్, ఓపీ సామగ్రి, తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ కావాల్సి ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనుదీప్ వివరించారు. రోగులకు కావాల్సిన మందులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలుపగా మహబూబ్‌నగర్ నుంచి కాకుండా నేరుగా హైద్రాబాద్ నుంచి మందులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రంజిత్ కుమార్, కోస్గి ఆస్పత్రి సూపరింటెండెంట్ అనుదీప్, ఆస్పత్రి గైనకాలజిస్ట్ స్వేత ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి సందర్భంగా ఈ వేడుకను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామివార్ల ఉత్సవమూర్తులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు మంగళ వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిలకిస్తుండగా..అమ్మవారి మెడలో మంగళసూత్రధారణ కార్యక్రమం కనులపండువగా సాగింది. తలంబ్రాల అనంతరం తిరిగి స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు చేపట్టారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అళహరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో ఉత్సవ మూర్తులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

బినామీ పేర్లపై నడిచే వాహనాలను తొలగించండి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు బినామీల పేర్లపై నడిచే వాహనాలను వెంటనే తొలగించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధికారులు బినామీ పేర్లతో వాహనాలను కొనసాగిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బినామీ పేర్లతో అధికారులు సొంత వాహనాలను కొనసాగించడంతో నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోన్లు తీసుకుని వాహనాలను తెచ్చుకున్నామని వాహనాలను జిల్లా అధికారులు పెట్టుకోకపోవడంతో నెల వారి కిస్తులను చెల్లించలేకపోతున్నామన్నారు. కలెక్టర్ స్పందించి సొంత వాహనాలను ఉన్న వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మర్యాద పూర్వకంగా నోటు పుస్తకాలు, పెన్నులను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మధు, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొకుంట్లలో ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

ఏరువాక సాగారో...

జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రైతులు శనివారం జిల్లావ్యాప్తంగా ఏరువాక పున్నమి వేడుకలను ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. కాడెద్దులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల వీధుల్లో ఊరేగించారు. గ్రామ ఆలయాల వద్ద ఎడ్లబండ్లను పరుగులు తీయిస్తూ చెర్లకోలతో ఏరువాక తాడును తెంచే కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. వేడుకలు తిలకించేందుకు వేలాది మంది జనం తరలివచ్చారు.

- వివరాలు 9లో..

ఎంవీఎస్ కళాశాలలో కొత్త కోర్సులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వం కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చిందని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈమేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఏ హెచ్ఈపీ, బీఎస్సీ ఫార్మాసేల్స్, మార్కెటింగ్, బీకాం ఫైనాన్స్, బీబీఏ రీటెయిల్ ఆపరేషన్స్ వంటి ఒక్కో కోర్సుల్లో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు డిగ్రీ మూడో సంవత్సరంలో స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. ఈ కోర్సుల్లో ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు వచ్చే విధంగా రూపొందించారన్నారు. మార్కెటింగ్, కామర్స్ వంటి రంగాల్లో అనేక రకాలైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంవీఎస్ కళాశాలలో పూర్తి స్థాయిలో వసతులు, సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఈనెల 25 నుంచి మూడో దశ దోస్త్ దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని, అందులో కొత్త కోర్సులకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, టాస్క్ వంటి వాటి ద్వారా అనేక శిక్షణలు ఇప్పించి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. సమావేశంలో ఈశ్వరయ్య, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,526

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో శనివారం మొక్కజొన్న క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,526, కనిష్టంగా 2,129 ధరలు లభించాయి. ధాన్యం ఆర్ఎన్ఆర్ రకానికి సంబంధించి గరిష్టంగా 2,389, కనిష్టంగా రూ.1,939, హంసకు గరిష్టంగా రూ.1,925, కనిష్టంగా రూ.1,818 ధరలు పలికాయి.

నల్లాల సర్వే పక్కాగా చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

గండేడ్: గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాల సర్వే పక్కాగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్‌లో నల్లాల సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఇళ్లకు నల్లా కనెక్షన్లు లేకపోతే డీపీఓ అనుమతితో ఏర్పాటు చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ వినియోగదారుల రిజిస్టర్‌ను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ శంకర్‌నాయక్, మిషన్ భగీరథ ఏఈ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు కలీం, శోభ, కారోబార్ పులీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

భార్య చేతిలో భర్త హతం

- నాగర్‌కర్నూల్ జిల్లా అనంతసాగర్‌లో ఘటన


బెల్లె శ్రీను (ఫైల్)

తెలకపల్లి: భర్తను భార్య కడతేర్చిన ఘటన మండలంలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. మండలంలోని అనంతసాగర్‌కు చెందిన బెల్లె శ్రీను (48), భార్య రాములమ్మ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహం కాగా.. కుమారుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. శ్రీను, రాములమ్మ మద్యానికి బానిస కావడంతో నిత్యం ఇంట్లో గొడవ జరిగేవి. శుక్రవారం రాత్రి ఇంట్లో మద్యం తాగిన శ్రీను భార్యతో గొడవపడ్డాడు. మాట మాట పెరగగా క్షణికావేశంలో రాములమ్మ రోకలిబండతో శ్రీను తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి పరిసరాల్లోని ప్రజలు చూసి పోలీసులకు అదే సమయంలో సమాచారం అందించడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. శనివారం కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూత్పూర్: అడ్డాకుల మండలం కందూరుకు చెందిన పెద్ద వెంకటయ్య (42) శనివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ఈనెల 17న పెద్ద వెంకటయ్య భూత్పూర్ నుంచి కందూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. అన్నాసాగర్ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హోటల్ గదిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

జడ్చర్ల: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జడ్చర్ల శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి కొనసాగుతున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ హోటల్‌లో శనివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చాకలి సురేష్(40) హైదరాబాద్‌లోని చందానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 20న షాద్‌నగర్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. అక్కడి నుంచి జడ్చర్లలోని సింధూర హోటల్‌లో అద్దెకు దిగాడు. కాగా శనివారం హోటల్ గదిలో అతడు చనిపోయి ఉండడంతో సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా సురేష్ 'ఈ పరిస్థితుల్లో నాకు జీవించడం లేదు' అని నోట్ రాసి.. పురుగుల మందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు అప్పులు తీవ్రం కావడం కారణంగా అనుమానిస్తున్నారు. సురేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఓ వ్యక్తి ఉరేసుకొని మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ముడుమాలగుర్తికి చెందిన గొల్ల మల్లికార్జున్ (41) కర్నూలులో ఉంటూ అక్కడే పోస్టాఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. 44 నంబర్ జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. మల్లికార్జున్ కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం ఖిల్లాఘనపురంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బెస్తగేరికి చెందిన కాడమోని శ్రీనివాసులు ఇంటిలో దీపం పెట్టి బయటకువెళ్లాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న విద్యుత్‌వైర్‌కు దీపం వేడి తగలడంతో అది కరిగింది.. అందులోని రెండు వైర్లు కలిశాయి. ఈ సమయంలో మంటలు రేగడంతో ఇల్లు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కాగా ఇంట్లోని దుస్తులు, వంట సామగ్రి, తిండి గింజలు తదితర సామగ్రి కాలిపోయింది. బయటకు పెద్దఎత్తున పొగ రావడంతో గ్రామస్తులు శ్రీనివాసులుకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు మంటల్లో కాలిపోయాయి. దీంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని శ్రీనివాస్ కోరుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు ఆగారం ప్రకాష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50 కిలోల బియ్యం, రూ.5వేల నగదును అందజేశారు.

అద్భుతక్షేత్రంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి


జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

అలంపూర్: ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడంతో అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి అన్నారు. అలాగే రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, అతిథిగృహాలు తదితర వసతులు కల్పిస్తామన్నారు. అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్ వరకు రోడ్డు విస్తరణ చేయాలని వినతులు అందాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. 'వృక్షాలను కాపాడండి.. పర్యావరణాన్ని రక్షించండి' అంటూ స్నేక్ సొసైటీ ఫౌండర్ చీరాల కృష్ణసాగర్ అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టే పాదయాత్రను శనివారం చిన్నారెడ్డి జెండా ఊపి ప్రారంభించి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, తగినన్ని చెట్లు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. రాష్ట్రంలో 24 శాతం భూభాగం పచ్చదనంతో నిండి ఉందని.. వాతావరణ సమతుల్యత ఏర్పడాలంటే 33 శాతం అవసరమని, ఇంకా తొమ్మిది శాతం మొక్కలు పెంచాలని వివరించారు. కృష్ణసాగర్ పాదయాత్ర జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతూ కొనసాగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

నెలాఖరున ఆస్పత్రి ప్రారంభం..

అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని నెలాఖరు నాటికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నట్లు డా. చిన్నారెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రోత్సాహంతో ఆస్పత్రి అందుబాటులోకి వస్తోందన్నారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తామని, జూరాల సమస్యను మాజీ ఎమ్మెల్యే సంపత్ వివరించారని, సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు.

ఆలయాల సందర్శన..

అలంపూర్ ఆలయాలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాల బ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం షా–అలీ–పహిల్వాన్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బతికుండగానే చంపేశారు..

నకిలీ సర్టిఫికెట్లతో 1.8 ఎకరాల భూమి పట్టా


ఎడమ పెద్ద సాయిలమ్మ

అమ్రాబాద్: ఓ వృద్ధురాలు బతికుండగానే అధికారులు చంపేశారు. ఆమెకు డెత్ సర్టిఫికెట్ జారీ చేయడంతో పాటు ఆమె పేరుమీద ఉన్న 1.8 ఎకరాల భూమిని మరో మహిళ పేరుపైకి పట్టా మార్పిడి చేశారు. ఇందుకు సంబంధించి బాధితురాలి వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లికి చెందిన ఎడమ పెద్ద సాయిలమ్మకు సర్వేనంబర్ 836లో 1.8 ఎకరాల సాగుభూమి ఉంది. ఈ భూమిని పెద్ద సాయిలమ్మ కుమారుడు బచ్చయ్య సాగుచేస్తున్నాడు. అయితే తనకు రావాల్సిన రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. విషయం తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. చివరకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకోగా.. భూమి యజమానురాలైన పెద్ద సాయిలమ్మ మరణించినట్లు పత్రాలు జతపరిచి, అదే గ్రామానికి చెందిన జబ్బు అలివేలమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది.


ఎడమ పెద్ద సాయిలమ్మ పేరుమీద ఉన్న భూమి అలివేలమ్మకు బదలాయింపు ధ్రువపత్రం

నాకు న్యాయం చేయండి..

నా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా నేను బతికుండాగానే చనిపోయినట్టు పత్రం తీసుకున్నారు. నేను చనిపోయినట్లు ధ్రువపత్రం ఇచ్చిన అధికారులతో పాటు నా భూమిని ఇతరుల పేరుమీదకు మార్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. నా భూమిని నాపేరు మీదకు మార్చాలి.

– ఎడమ పెద్ద సాయిలమ్మ, కుమ్మరోనిపల్లి

విచారణ జరిపిస్తాం..

గతంలో జరిగిన భూరిజిస్ట్రేషన్ విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపిస్తాం. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరిచి తదుపరి చర్యలు చేపడతాం.

– సరిత, తహసీల్దార్, అమ్రాబాద్

వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


హైకోర్టు న్యాయమూర్తులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామివారిని, ఆనంద గిరి లక్ష్మీ శ్రీవేంకటేశ్వరస్వామి వారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ప్రియదర్శిని, మాధవిదేవి శనివారం దర్శించుకున్నారు. ఉదయమే న్యాయమూర్తులిద్దరూ దంపతులతో కలిసి హాజరుకాగా ఆలయాల అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయాల విశిష్టత, చరిత్రలను వివరించారు. ఇదిలా ఉండగా వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం వైభవంగా జైష్ట్యాభిషేకం పూజలను అర్చకులు నిర్వహించారు. న్యాయమూర్తులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 908 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వివరించారు. కాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 750, ఆవిరి రూపంలో 140, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్ సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 200 ఇలా.. మొత్తంగా ప్రాజెక్టు నుంచి 2,054 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.830 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 814.9 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం నాటికి నీటిమట్టం 814.9 అడుగులకు చేరింది. కాగా 37.3004 టీఎంసీల నీరు జలాశయంలో నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 449 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది.

రామన్‌పాడుకు 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగా ఉంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శనివారం నాటికి పూర్తి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూ రాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. కాగా తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ. సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

బీచుపల్లిలో భక్తుల రద్దీ


ఆంజనేయస్వామిని దర్శించుకొంటున్న భక్తులు


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ ప్రధాన అర్చకులు మారుతిచారి ఆధ్వర్యంలో స్వామికి ఆకుపూజ, అభిషేకం తదితర కార్యక్రమాలు చేపట్టారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలయంలో వికాస తరంగిని ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు 41సార్లు హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా నిర్వహించారు.

భయబ్రాంతులకు గురిచేయడంతో ఆత్మహత్య

నవాబుపేట: భయబ్రాంతులకు గురిచేయడంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని హైదరాబాద్ నాగోల్‌కు చెందిన కమ్మరి భాగ్యమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాద్ నాగోల్‌కు చెందిన విఠలాచారి (60) నవాబుపేట మండలంలోని కారూర్ ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పొలం కొనుగోలు చేశాడు. ఇటీవల పొలాన్ని అమ్మకానికి పెట్టగా.. రెండునెలల క్రితం పాల్మాకులకు చెందిన ముష్టి వెంకటేష్, మరో నలుగురు వ్యక్తులు పొలాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు. అడ్వాన్స్‌గా రూ.50వేలు ఇచ్చి, ఒప్పందం చేసుకున్నారు. అనంతరం పొలానికి దారి లేదని సాకు చెబుతూ, ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. భూమిని తక్కువ ధరకు అమ్మనని.. కావాలంటే అడ్వాన్స్ తిరిగి ఇచ్చేస్తానని చెప్పినా వినలేదు. భూమిని తక్కువ ధరకు విక్రయించకుంటే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయబ్రాంతులకు గురైన విఠలాచారి.. శనివారం కారూర్ సమీపంలోని పొలం పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

మేకల కాపరి దారుణ హత్య


బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి


ఆంజనేయులు (ఫైల్)

కుమార్తె ప్రేమ వ్యవహారంపై అనుమానం

జడ్చర్ల: మేకల కాపరి మెడ కోసి అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన పట్టణ శివారులో శనివారం వెలుగు చూసింది. హత్యకు కుమార్తె ప్రేమ వ్యవహారమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. కావేరమ్మపేట శివారు రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన మెక్కం చిన్న ఆంజనేయులు (42) రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటికి కొద్దిదూరంలో ఉన్న మేకల మందకు కాపలాగా వెళ్లాడు. శనివారం ఉదయం అతడి కుమారుడు మంద వద్దకు వెళ్లి చూడగా రక్తపు మడుగులో తండ్రి ఆంజనేయులు పడి ఉండటాన్ని గమనించి తల్లికి విషయం చెప్పారు. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఆదిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించడంతో పాటు జాగిలంతో అన్వేషించారు. హత్య జరిగిన ప్రదేశంలో కారంపొడి, మద్యం సీసా, రెండు గ్లాసులు పడి ఉండగా వాటి మీది వేలిముద్రలు సేకరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కాగా కుమార్తె అంజలి ప్రేమ వ్యవహారంలో గొడవలు జరిగాయని, హత్యకు ముందురోజు రాత్రి కూడా కుమార్తెను తండ్రి మందలించాడని.. హత్యకు ప్రేమ వ్యవహారం కూడా కారణం అయి ఉండవచ్చని సోదరుడు నడిపి ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

వేకప్ తెలంగాణ అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్యాంప్రసాద్

కొల్లాపూర్: పట్టణానికి చెందిన దంత వైద్యుడు శ్యాంప్రసాద్ వేకప్ తెలంగాణ–2024 అవార్డును అందుకున్నారు. ది బెస్ట్ ఇంప్లాంటాలజిస్టుగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ చంద్ర కుమార్ అవార్డును అందజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన కారు

అలంపూర్/ఆత్మకూర్: ఉమ్మడి జిల్లాలో శనివారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన సాయి దీపక్, బాబ్జాన్, జిలానీ కారులో ఏపీలోని అనంతపురం వెళ్తుండగా, ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. లారీని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

■ ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఆత్మకూర్ మండలం కత్తేపల్లి చెరువు కట్టపై చోటుచేసుకుంది. మండలంలోని తూంపల్లికి చెందిన జగదీష్, కత్తేపల్లికి చెందిన కురుమూర్తి బైకులపై స్వగ్రామాలకు వెళ్తూ.. ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో వారికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బాధిత మహిళకు అండగా ప్రభుత్వం

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి


బాధిత మహిళను పరామర్శిస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్: బాధిత చెంచు మహిళకు, కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎంపీ మల్లు రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను శనివారం ఎంపీ, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణతో కలిసి పరామర్శించారు. బాధితురాలికి అందుతున్న వైద్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దాడి చేసిన వారిని ఇప్పటికే అరెస్ట్ చేశారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీవ్రమైన చర్యలు తీసుకునేలా ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీజీపీతోపాటు, కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారన్నారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా కొందరు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చర్యలన్నీ తీసుకున్న తర్వాత వారం రోజులకు స్పందించారన్నారు. ఊరికే ప్రభుత్వంపై బురద జల్లే పనులే తప్పా చెంచులు, ప్రజలపై ఎలాంటి ప్రేమ లేదన్నారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ బాధిత మహిళకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధిత మహిళకు ఇప్పటికే రూ.4లక్షలు ఆర్థికసాయం ప్రకటించారన్నారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని, బాధిత మహిళకు అన్ని విధాలు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఘటనను కొందరు రాజకీయ ఉనికి కోసం వాడుకోవాలని చూస్తున్నారని, ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చిన అండగా ఉంటామని తెలిపారు.

పరామర్శించిన కర్నె శిరీష

చికిత్స పొందుతున్న చెంచు మమిళను కర్నె శిరీష (బర్రెలక్క) పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గంలో ఇలాంటి ఘటన జరగడం జీర్ణించుకోలేని విషయమని తెలిపారు.

రెండో నిందితుడిని అరెస్ట్ చేయాలి

మన్ననూర్: చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన అఘాయిత్యంలో రెండో నిందితుడు బండి శివుడును వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జక్క బాలయ్య, కేవీపీఎస్ లక్ష్మీనారాయణ, టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ అంబయ్య శనివారం మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గంలో చెంచు మహిళపై ఇంతటి ఘోరం జరగడం దురదృష్టకరం అన్నారు. కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కొందరు వ్యక్తులు ఈ కేసు నుంచి బండి శివుడును తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అంతకు ముందు చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు.

ఎరువులు, విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి


మాట్లాడుతున్న జక్కుల వెంకటయ్య

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను ఉచితంగా ఇవ్వాలని.. తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా సంఘం కార్యాలయంలో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ చట్టం చేయాలని కోరారు. జిల్లాలో చాలాచోట్ల నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించి సదరు కంపెనీల లైసెన్స్ చేయాలన్నారు. సరఫరా చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూముల సమస్యలు అధికంగా ఉన్నాయని అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం చిన్నపొర్ల గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనను గుర్తుచేశారు. వెంటనే భూముల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పోడు రైతాంగానికి హక్కు పత్రాలను ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామారం వెంకటయ్య, ఖాజా, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.